ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 41.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 2 మే 2025





టీడీపీ అర్బన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచుతున్న పార్టీ నాయకులు



సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ



అనంతలో ఏఐటీయూసీ ర్యాలీ

శ్రమ జీవుల వేడుక

జిల్లా వ్యాప్తంగా ఘనంగా మేడే

మేడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు నిర్వహించి.. శ్రామికుల ఐక్యతను చాటారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాల యంలో ఆ పార్టీ కార్మిక విభాగం నాయకులు జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను చేతబట్టి అనంతపురంలో భారీ ర్యాలీలు నిర్వహించారు.

(వివరాలు 7లో)

ఫ్రీ లేదా..?



- రెండో ఉచిత సిలిండర్‌కు జమకాని సొమ్ము
- ఆందోళనలో లబ్ధిదారులు
- సమావేశాలు పెట్టి విడుదల చేస్తాం: యంత్రాంగం

● రుద్రంపేటకు చెందిన లక్ష్మిరెడ్డి ఏప్రిల్ 10న దీపం-2పథకం కింద రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేశాడు. 13న గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యింది. డబ్బులు కట్టారు. 15న కేంద్రం ఇచ్చే రూ.50లు సబ్సిడీ అతడి ఖాతాలో జమ అయ్యింది. అయితే సిలిండర్‌కు చెల్లించిన మిగతా సొమ్ము నేటికీ రాష్ట్ర ప్రభుత్వం అతడి ఖాతాకు జమ చేయలేదు.

● అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్‌నగర్‌కు చెందిన లలితమ్మ గత నెల 20న గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నారు. సిలిండర్ వచ్చింది, డబ్బుకట్టారు. ఈమెకు కూడా కేంద్రం ఇచ్చే రూ.50 మాత్రమే జమ అయింది, మిగిలిన డబ్బు జమకాలేదు, ఇలా ఒక్కచోటకాదు జిల్లావ్యాప్తంగా రెండో ఉచిత సిలిండర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము జమకాలేదు.



అనంతపురం టౌన్, మే1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మహిళల కోసం దీపం-2 పథకం తీసుకొచ్చింది. ఈపథకం ద్వారా అర్హులైన పేదలకు ఏడాదికి మూడు ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. ఇచ్చిన హామీమేరకు సీఎం చంద్రబాబునాయుడు గతేడాది డిసెంబరు నెలలో ఈపథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి నాలుగు నెలలకు ఓ సిలిండర్‌ను ఉచితంగా లబ్ధిదారులకు అందజేస్తామని అప్పట్లో చెప్పారు. ఒక్కో సిలిండర్ ఏ నెలనుంచి ఏ నెల వరకు వినియోగించుకోవచ్చో కూడా ప్రకటించారు. ఆమేరకు జిల్లా యంత్రాంగం అమలు చేస్తూ వస్తోంది. అధికారిక లెక్కల మేరకు జిల్లాలో 6,60,330మందికి రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో దీపం-2ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో 5,05,831మంది దీపం-2పథకానికి అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందులో తొలి సిలిండర్ కాల వ్యవధి నాలుగు నెలలు ముగిసేసరికి (మార్చి31వతేదీకి) 4.17.502మంది లబ్ధిపొందారు. వీరికి సిలిండర్ తీసుకున్న 48గంటలలోపే నగదు వారి బ్యాంకుఖాతాల్లోకి జమ చేశారు.

● రెండో సిలిండర్‌కు జమకాని డబ్బులు

దీపం-2పథకం ద్వారా రెండో ఉచిత వంట గ్యాస్ సిలిండర్‌ను ఏప్రిల్ 1వతేదీ నుంచి వినియోగించుకునే అవకాశం ఉంది. దీంతో అవసరమైన లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్నారు. అధికారుల లెక్కల మేరకు ఇప్పటివరకు రెండోఉచిత సిలిండర్‌ను దాదాపు30వేల మందికి పైగానే బుక్ చేసుకొని, డబ్బులు చెల్లించి డెలివరీ తీసుకున్నారు. నిబంధనల మేరకు 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేయాల్సి ఉంది. కానీ నెలదాటినా ఇప్పటికీ రాయితీ సొమ్ము జమ కాలేదు. దీంతో ఉచితం మొదటి సిలిండర్‌కే పరిమితమా? రెండో సిలిండర్‌కు డబ్బులు రావా అని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగం మాత్రం ఈనిధులు త్వరలో జమ చేస్తారని అంటున్నారు.



సమావేశాలు పెట్టి జమ

దీపం-2 పథకం రెండో ఉచిత సిలిండర్‌కు డబ్బు జమ చేస్తాం. ఇప్పటికే ప్రభుత్వం ఆ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అయితే త్వరలో ప్రతి నియోజకవర్గంలోనూ లబ్ధిదారులతో సమావేశాలు పెట్టి అదేరోజు నుంచి సిలిండర్ పొందిన లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తాం. ఈవిషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- జగన్నాథరావు, ఇన్‌చార్జ్ డీఎస్ఓ

పెద్దాస్పత్రిలో కంట్రోల్ రూమ్



కంట్రోల్ రూమ్ ఏర్పాటు గురించి చర్చిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమ్యల పరిష్కార వేదికకు ఆస్పత్రిపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో కలెక్టరు వినోద్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి గురువారం సెక్షన్ ఆఫీసర్లతో సమావేశమై చర్చించారు. కంట్రోల్ రూమ్‌లో రణకుమార్, అమీనా అనే ఇద్దరు సిబ్బందిని నియమించామని, వారిలో ఒకరు ఉదయం, మరొకరు సాయంత్రం కంట్రోల్ రూమ్‌లో ఉంటూ ఫిర్యాదులు తీసుకుంటారని తెలిపారు. ఆ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కేసులను విభాగాల వారీగా పక్కాగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నీట్‌గా నిర్వహించాలి: కలెక్టర్



అనంతపురం టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. ఈ నెల 4న నిర్వహించే నీట్ పరీక్షల గురించి కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 360 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 294 మంది, ఎస్కేయూ ఇంజినీరింగ్ కాలేజీలో 720 మంది, జేఎన్‌టీయులో 480 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, పరీక్ష నిర్వహణకు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. సమీక్షలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్వో మలోల, ఏఎస్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు డ్రోన్ సర్వే

జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్



డ్రోన్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

గార్లదిన్నె, మే 1(ఆంధ్రజ్యోతి): డ్రోన్ సర్వేతో చీనీ తోటలకు సోకే తెగుళ్ల నివారణకు చర్యలు సులభతరం అవుతాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామంలో చీనీ తోటలకు సోకే తెగుళ్ల నివారణ కోసం ఉద్యాన శాఖ అధికారులు డ్రోన్ సహాయంతో గురువారం సర్వే చేపట్టారు. జిల్లా అధికారి ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ చీనీ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోనే చీనీ సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉన్న ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. డ్రోన్ సహాయంతో చీనీ తోటలపై సర్వే చేసి, తోటలకు సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు పసిగట్టి, నివారణకు తగిన చర్యలు తీసుకునేలా రైతులను అప్రమత్తం చేస్తామన్నారు. మూడు రోజుల నుంచి గ్రామంలో డ్రోన్ సహాయంతో 55 ఎకరాల విస్తీర్ణాన్ని అధ్యయనం చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, విస్తరణ అధికారి రామాంజనేయులు, రైతులు వెంకట్రామిరెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ, రామ్మోహన్‌రెడ్డి, హనుమంతు, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ వినోద్ కుమార్
- బండమీదపల్లిలో పింఛన్ల పంపిణీ

రాప్తాడు, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్లెలను స్వర్ణ గ్రామాలుగా తీర్చి దిద్దుతామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని బండమీదపల్లి గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లాలాసాహెబ్‌పల్లి చెరువులో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గడ్డపార చేతబట్టి పని చేశాడు. రోజూ ఎన్ని క్యూబిక్ మీటర్లు పని చేస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ప్రతిరోజూ తాగు నీరు, నీడ సౌకర్యాలు ఉన్నాయా, ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరుకావాలన్నారు. పనులు సక్రమంగా చేస్తే రోజుకు రూ. 300 కూలి లభిస్తుందన్నారు. కూలీలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతు సాదిక్‌వలి తోటలో ఫాంపాండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రైతు గోవిందు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన పశువుల తాగునీటి తొట్టిను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి, పలు విషయాలు వివరించారు. గ్రామంలో పరిశుభ్రత ఇంకా మెరుగుపడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత, పొలాల్లో ఫాంపాండ్లు ఉండాలని, ప్రతి ఇంటి వద్ద పాడి పశువులు ఉండాలన్నారు. జిల్లాలో 1400కు పైగా గోకులం షెడ్లు నిర్మించడంతో రెండో స్థానంలో ఉందన్నారు. బండమీదపల్లి నుంచి లాలాసాహెబ్‌పల్లి వరకూ తారు రోడ్డు, బండమీదపల్లి నుంచి పాలబావి, ఎం. చెర్లోపల్లి వరకూ మట్టి రోడ్లు నిర్మించాలని, గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డ్వామా పీడీ సలీంబాషా, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి, ఉపాధి కల్పనా అధికారి కళ్యాణి, డీఎల్‌పీఓ లలితాబాయి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ ఉమాదేవి, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



బండమీదపల్లిలో రూ. 15 వేలు పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్



ఎంఈవోతో కలిసి వెళుతున్న విద్యార్థులు

వినువీధిలో విహారానికి..!

బెళుగుప్ప, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఎంఈవో మల్లారెడ్డి విమానంలో ఎక్కించేందుకు తీసుకువెళ్లారు. పరీక్షలకు ముందు ఇచ్చిన మాట మేరకు ఆకాశ వీధిలో విహారాన్ని ఆయన కానుకగా ఇచ్చారు. కలెక్టర్, డీఈవో అనుమతి తీసుకుని విద్యార్థులు ఈశ్వరి, మధు శ్రీ, అర్చన, ఇందు, లావణ్యతో కలిసి గురువారం బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు వెళతామని ఎంఈవో తెలిపారు.

జిల్లాలో సజావుగా పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ గురువారం సజావుగా సాగింది. ఉదయం 7గంటల నుంచి 31 మండలాలు, 6 మున్సిపాలిటీలలో గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది పించన్ పంపిణీ ప్రారంభించారు. మే నెలకు సంబంధించి జిల్లాలో 2,78,582 మందికి రూ.124.95కోట్లు నిధులు మంజూరు చేశారు. తొలి రోజు 2,64,287మందికి రూ.117.41 కోట్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ శైలజ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా వ్యాప్తంగా పింఛన్ పంపిణీని మానిటరింగ్ చేశారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ రాప్తాడు మండలం బండమీదపల్లిలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

ఆస్పత్రుల అభివృద్ధికి రూ.478 కోట్లు

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులునాయుడు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం టౌన్, మే1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులలో వసతులు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందుకోసం వివిధ పథకాలు రూపొందించి, వాటి ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.కోట్లు విడుదల చేస్తున్నాయి. ఈక్రమంలోనే జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు మంజూరైన నిధులు, చేస్తున్న పనుల వివరాల గురించి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాసులునాయుడు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధికి ఎన్ని కోట్లు మంజూరయ్యాయి?

ఈఈ: జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలతో పాటు ఇతర ఆస్పత్రుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.478కోట్లు మంజూరు చేశాయి.

ప్రశ్న: వచ్చిన నిధులతో ఎన్ని ఆస్పత్రుల్లో పనులు చేపట్టారు?

ఈఈ: జిల్లాలో మొత్తం 29 పనులకు నిధులు ఇచ్చాం. వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి, వైద్య విధానపరిషత్ పరిధిలోని సీహెచ్‌సీలలో పనులు కొనసాగుతున్నాయి. జిల్లాఆస్పత్రికి సంబంధించి సూపర్‌స్పెషాలిటీలో క్రిటికల్ కేర్, మెడికల్ కాలేజ్ పరిధిలో సర్జికల్ బ్లాక్, హాస్టల్‌భవనాలు, వైద్యవిధాన పరిషత్ కింద పాతూరు సీడీ ఆస్పత్రి, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం, సీహెచ్‌సీల నిర్మాణాలు చేపట్టాం. జిల్లా ఆస్పత్రిలో వివిధ రకాల మరమ్మతులు చేపట్టాం.

ప్రశ్న: ఇప్పటివరకు ఎన్ని పనులు మొదలయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి?

ఈఈ: మొత్తం 29 పనులకుగాను జిల్లాలో 11ఆస్పత్రులలో అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 11పనులు వివిధ సమస్యలతో పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్ కాలేజ్‌లో యుజీ సీట్ల ఆధారంగా ఆస్పత్రి బ్లాక్, లైబ్రరీబ్లాక్, బాలికల హాస్టల్ నిధుల పెండింగ్‌తో పనులు ఆగిపోయాయి. ఇంకా పామిడి, గుత్తి, సీహెచ్‌సీలలో కొన్నిపనులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: ఇప్పటివరకు ఎన్నికోట్లు ఖర్చుపెట్టారు..?

ఈఈ: జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తరపున రూ.341కోట్ల పనులకు ఒప్పందం చేసుకున్నాం. ఇందులో 101కోట్లు చేసిన పనులకు ఇచ్చాం. ఇంకా రూ3.12కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: ఎంసీహెచ్‌బ్లాక్ నిర్మాణం జరుగుతుందా ?

ఈఈ: ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఇరిగేషన్‌శాఖ కార్యాలయం ఖాళీ చేయించి, సర్జికల్‌బ్లాక్ నిర్మాణం పనులు మాత్రమే ప్రస్తుతం చేయిస్తున్నాం. ఆర్అండ్‌బీ కార్యాలయం ఖాళీ చేయించి అక్కడ అత్యంత కీలకమైన ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుకు అప్పట్లో నిర్ణయం తీసుకున్నారు. అయితే నిధులు సమస్యతో ప్రస్తుతం ఆస్పత్రికి సంబంధించిన ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం జరిగేటట్లు కనిపించడం లేదు. కేంద్రం నుంచి వచ్చే నిధులపైనే ఈఎంసీహెచ్ నిర్మాణం ఆధారపడి ఉంటుంది.



అజ్ఞాతంలోకి తోపుదుర్తి

ఇంటికి వెళ్లి ఆరా తీసిన పోలీసులు (మెయిన్‌లో)

అనంతపురంలోని తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఇంటి వద్ద రామగిరి పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

కనగానపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లి 44వ జాతీయ రహదారిపై గురువారం 407 వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు మామిళ్లపల్లి గ్రామానికి చెందిన నరసింహులు(53) మతిస్థిమితం లేక రోడ్ల వెంబడి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలోనే పర్వతదేవరపల్లి వద్ద ఉండగా పెనుకొండ నుంచి అనంతపురం వైపు వెళుతున్న 407 వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

బత్తలపల్లి, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి మల్లేష్(48) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు కోడెకండ్ల గ్రామానికి చెందిన మల్లేష్ బుధవారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటిలో నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు రైల్వేపోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా కోడేకండ్ల గ్రామానికి చెందిన మల్లేష్‌గా గుర్తించారు. మల్లేష్ ధర్మవరంలోని ఓ వడ్డీ వ్యాపారి వద్ద అధిక వడ్డీకి అప్పు చేశాడు. అప్పు చెల్లించలేదని ఇతడికి సంబంధించిన ట్రాక్టర్, రెండు బైకులు, ఒక కారును ఆ వడ్డీవ్యాపారి తీసుకెళ్లాడు. అయినా అప్పు తీరలేదని బెదిరించడంతో ఓ వైపు అవమానభారం, మరోవైపు అప్పుతీరలేదని ఆవేదనతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

గోరంట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రామాలయం వీధికి చెందిన వివాహిత అశ్వినీ అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. రవీంద్రారెడ్డి భార్య అశ్వినీ ఇంటి నిర్మాణం కోసం కదిరి బ్యాంక్‌లో రుణం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన నెలసరి కంతు రూ. 12వేలు బ్యాంక్‌లో చెల్లించడం కోసం గతనెల 26న కదిరికి వెళ్లారు. తరువాత ఆమె రాకపోవడం, ఫోన్ చేసిన స్విచ్ ఆఫ్ రావడంతో భర్త, బంధువులు ఆమెకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బుక్కపట్నం, మే1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన పోతన్న (84) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు కింద గ్రామానికి చెందిన పోతన్న, పెద్దన్న కూర్చొని మాట్లాడుకుంటున్నారు. బుక్కపట్నానికి చెందిన శ్రీరామరెడ్డి అనే వ్యక్తి నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడుపుకుంటూ వారిని ఢీకొట్టాడు. పోతన్న ముఖంపై బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పెద్దన్నకు కాలు విరిగింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించి, గాయపడిన పెద్దన్నను పుట్టపర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణీ కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 875 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జనన.. మరణ రికార్డులతో ఓటరు జాబితా అనుసంధానం

అనంతపురం టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): పారదర్శక ఓటరు జాబితా తయారీకి కేంద్ర ఎన్నికల కమిషన్ మరో చర్యను తీసుకుంది. ఇప్పటికే ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయిస్తోంది. మరింత ఖచ్చితత్వం కోసం జనన, మరణ రికార్డులతో ఓటరు జాబితాను అనుసంధానం చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఈ ఉత్తర్వులు కలెక్టరేట్‌కు గురువారం చేరాయి. ఈ ప్రక్రియ పూర్తయితే, మరణించిన వ్యక్తి పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడం సులభతరమౌతుంది. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పక్కా సమాచారాన్ని సేకరించి, వివరాలు నమోదు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆ ఉత్తర్వులలో పేర్కొంది.

16న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ స ర్వసభ్య సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావే శం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్, మం త్రులు, జడ్పీ వైస్ చైర్మన్లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కార్మిక హక్కుల కోసం పోరాడుతాం

మేడే సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. మే డేను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎర్ర జెండాలను ఎగురవేసి ర్యాలీలు నిర్వహించారు. అనంతపురం నగరంలో కృష్ణ కళామందిర్ నుండి క్లాక్‌టవర్ మీదుగా లలితకళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిషత్‌లో నిర్వహించిన సభలో రాంభూపాల్ మాట్లాడుతూ 1886 చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతామని దీక్షబూనే రోజే మేడే అన్నారు. హక్కుల కోసం కార్మిక సంఘాల నిర్మాణం, ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న హక్కులు నేటి పాలకవర్గాల విధానాల వల్ల నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనుగోలు శక్తి తగ్గిపోవడం, నిరుద్యోగం, శాంతిభద్రతల సమస్య, ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, మతవిద్వేషాలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. కశ్మీర్ ఉగ్రదాడి ఘటనను సైతం కేంద్రం రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. దేశ రక్షణ కోసం ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముత్తుజ, వలి, కృష్ణవేణి, శ్రీనివాసులు, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆజామ్, ఎర్రిస్వామి, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, సుధాకర్, మసూద్, లతీఫ్, హాజీవలి, ఆది పాల్గొన్నారు.


డప్పుకొడుతున్న కళాకారులు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి: ఏఐటీయూసీ



నగరంలో ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అనంతపురం విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం లేబర్స్ కోడ్స్ రద్దు చేసి, కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక దినోత్సవాన్ని గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగరంలో యూనియన్ కార్యాలయాల వద్ద, కూడళ్లలో, కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. తర్వాత నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కృష్ణకళామందిర్ వరకూ 136 అడుగుల జెండాతో నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఎన్నో పోరాటాల ఫలితమే మే డే అన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఇతర నేతలు కృష్ణుడు, రాజు, రామకృష్ణ, బాషా, ఇబ్రహీం, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.

నేడు రెండు రైల్వే ప్రాజెక్టుల ప్రారంభం

ప్రారంభించనున్న ప్రధాని మోదీ

గుంతకల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన రెండు ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. రాజధానితోపాటు పలు ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం ప్రధానమంత్రి శుక్రవారం రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా గుంతకల్లులో పూర్తయిన రెండు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల గుంతకల్లు-విజయవాడ లైన్‌లో ప్రయాణికులను చేరవేసే రైళ్ల నియంత్రణ, వాటి సమయపాలన, సరుకు రవాణా రైళ్ల ట్రాఫిక్‌కు ఉపయోగం కలగనుంది.

సరుకు రవాణా కోసం బైపాస్ లైన్

కర్ణాటకలోని జిందాల్ తదితర స్టీల్ ఫ్యాక్టరీల నుంచి విజయవాడ వైపు వెళ్లే సరుకు రవాణా రైళ్ల సౌకర్యం కోసం వెస్ట్‌గుంతకల్లు-నంచెర్ల రైల్వే స్టేషన్ల మధ్య ఓ బైపాస్ లైన్‌ను నిర్మించేందుకు రైల్వేశాఖ అంచనాలను తయారుచేసింది. ఈ లైన్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించే కార్యక్రమాన్ని గత సంవత్సరంలో చేపట్టారు. రైతులకు భూ పరిహారాల చెల్లింపు విషయంగా మంతనాలు జరుగుతున్నాయి. భూ సేకరణకు, ట్రాక్ నిర్మాణం కోసం రూ. 293 కోట్లతో చేపట్టనున్న ఈ రైల్వే ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ బైపాస్ లైన్ నిర్మాణం వల్ల సరుకు రవాణా రైళ్లను గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి తీసుకురాకుండా నేరుగా విజయవాడ లైన్‌లోకి పంపుతారు. దీని వల్ల రైల్వే స్టేషన్‌లో ట్రాఫిక్ తగ్గి ప్రయాణికుల రైళ్లకు అంతరాయాలు తగ్గుతాయి.

గుంటూరు డబ్లింగ్‌లో ట్రాక్ ప్రారంభం

రాష్ట్ర రాజధానికి రైళ్ల కనెక్టివిటీ, ట్రాఫిక్ నియంత్రణ కోసం 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ. 3,887 కోట్లను విడుదల చేసింది. వీటి ద్వారా గుంతకల్లు-గుంటూరు రైల్వే సెక్షన్ విద్యుదీకరణతోపాటు ట్రాక్‌ను డబుల్ చేసే పనులు ప్రారంభమయ్యాయి. ఈ 401 కి.మీ.ల లైన్ నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా సాగుతున్నాయి. దాదాపు 85 శాతం పనులు పూర్తి అయ్యాయి. డబ్లింగ్ పనులలో భాగంగా బుగ్గనపల్లి సిమెంటునగర్-పాణ్యం రైల్వే సెక్షన్‌లో 18 కి.మీ.ల రైల్ రోడ్డు పూర్తి కావడంతో ఆ లైన్‌ను ప్రధాని శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. త్వరలో గుంతకల్లు-గుంటూరు రైల్వే లైన్ మొత్తం డబ్లింగ్ పూర్తి కానుంది. ఈ లైన్ డబ్లింగ్ అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్సు రైళ్ల వేగాలు పెరగడంతోపాటు, ట్రాఫిక్ వల్ల అంతరాయాలు తగ్గిపోతాయి. ఈ ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రయాణికులు తిలకించేలా డివిజనల్ రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


నిర్మాణం పూర్తయిన వెస్ట్ గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్

సాయమందిస్తే ఎవరెస్టును ఎక్కుతా

● జేసీ ప్రభాకర్ రెడ్డికి సమీరా ఖాన్ వినతి


సమీరాఖాన్‌ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, మే 1(ఆంధ్రజ్యోతి): సహాయ సహకారాలు అందిస్తే ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కుతానని పర్వతారోహకురాలు సమీరాఖాన్ అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని గురువారం ఆమె కలిశారు. ఇప్పటి వరకు తాను 37 దేశాల్లో సైకిల్ యాత్ర చేశానని, 11 పర్వతాలు అధిరోహించానని తెలిపారు. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కేందుకు సాయపడాలని జిల్లాలో చాలామంది నాయకులను కలిసి విన్నవించానని, ఎవరూ సాయపడలేదని తెలిపారు. తాను ఎన్నో కష్టాలు పడ్డానని, తల్లిదండ్రులను కోల్పోయానని అన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి సాయం చేస్తారనే నమ్మకంతో ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆయన సాయం చేయడంతోపాటు అల్ట్రాటెక్, అదానీ, అర్జాస్, సాగర్, మెఘా వంటి కంపెనీల ప్రతినిధులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి సాయం చేయాలని చెప్పడం తనకు సంతోషం కలిగిస్తోందని అన్నారు. జేసీ కుటుంబానికి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 5 నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభించి, నేపాల్‌లో ముగిస్తానని తెలిపారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారిత కోసం సైకిల్ యాత్ర చేస్తున్నానని ఆమె అన్నారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి సమీరా ఖాన్ సైకిల్ యాత్రను ప్రారంభించారు.

పింఛన్ సొమ్ముతో పరార్

గతంలో వేలిముద్ర వేయించుకుని బురిడీ

మారని డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర తీరు


పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న బెళుగుప్ప లబ్ధిదారులు

బెళుగుప్ప, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒకటో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర రూ.2.58 లక్షల పింఛన్ సొమ్ముతో ఉడాయించాడు. పంచాయతీ కార్యదర్శి శివరంజని బుధవారం మధ్యాహ్నం పింఛన్ సొమ్మును బ్యాంకు నుంచి డ్రా చేశారు. ఉపేంద్రకు 61 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.2.76 లక్షలను అందజేశారు. ఉపేంద్ర గురువారం ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు లబ్ధిదారులకు రూ.6 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగిలినవారికి పైసా కూడా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి ఎంపీడీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివరంజని దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు అప్రమత్తమై, వారు ఉపేంద్రకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. సచివాలయ సిబ్బందిని ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో బెళుగుప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉపేంద్ర గతంలోనూ పలువురు లబ్ధిదారుల చేత వేలిముద్ర వేయించుకుని డబ్బులు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రెండు నెలలు డబ్బు ఇవ్వలేదు..



వేలిముద్ర వేయించుకుని రెండు నెలల పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. నా ఆరోగ్యం బాగాలేదు. మాత్రలు కొందామంటే చేతిలో రూపాయి లే దు. ఇలా ఇబ్బందిపెడితే ఎలా? అ ధికారులు స్పందించి, పింఛన్ సొ మ్ము సక్రమంగా అందేలా చూడాలి.

- యల్లమ్మ, బెళుగుప్ప

డబ్బులివ్వకుండా తిప్పుతున్నారు



వేలిముద్ర వేయించుకుని డబ్బులు ఇవ్వలేదు. అడిగితే అదిగో ఇదిగో అంటూ తిప్పించుకుంటున్నారు. గత నెల డబ్బులు కూడా ఇవ్వలేదు.

- తిమ్మక్క, బెళుగుప్ప, ఎస్సీ కాలనీ

పంపిణీ చేయలేదు



ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్ల పంపిణీ పండుగలా జరిగేది. కానీ ఇప్పుడు ఇస్తారో లేదో తెలియడం లేదు. ఇక నుంచైనా పింఛన్లు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఉలెప్ప, బెళుగుప్ప

కప్పలబండ ఎంఎస్ఎంఈ ప్రారంభం

పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు


నెల్లూరు జిల్లా నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కుల పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం

పుట్టపర్తి, మే 1(ఆంధ్రజ్యోతి): కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలో అభివృద్ధి చేసిన 11 పార్కుల పైలాన్‌ను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నారంపేటలో ఆవిష్కరించారు. ఇందులో జిల్లాలోని మామిళ్లకుంట వద్ద 52.94 ఎకరాల్లో రూ.7 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన కప్పలబండ ఎంఎస్ఎంఈ కూడా ఉంది. ఈ పార్కుల్లో 32 ప్లాట్లు ఏర్పాటు చేశారు. ప్రధాన, అనుబంధ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, ఖాళీ స్థలం తదితర సదుపాయాలు కల్పించారు. జిల్లాలోని దాదులూరు, పెనుకొండ, మత్యాలచెరువు, ఆర్ అనంతపురం ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేశారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ

ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ చెస్ రేటింగ్‌లో స్థానం


కార్తికేయన్


నందకిషోర్

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లుటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఫిడే ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకి స్థానం దక్కింది. ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా జారీ చేసిన ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ చెస్ రేటింగ్‌లో అనంతపురం నగరానికి చెందిన నందకిశోర్‌కు 1501 ర్యాంక్, గుంతకల్లుకు చెందిన కార్తికేయన్‌కు 1497ర్యాంకు దక్కింది. ఒకే సారి ఇద్దరికి అంతర్జాతీయస్థాయి చెస్‌లో గుర్తింపు రావడం అభినందనీయమని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్ కుమార్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల (సొసైటీ)లకు నూతన పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం జీఓ నంబరు 229 జారీ చేశారు. బుక్కచెర్ల సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, ఉరవకొండ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి, ఆమిద్యాలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, బత్తలపల్లి, తాడిమర్రి సొసైటీలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరియాదాస్‌ను నియమించారు. అలాగే కనగానపల్లి సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరామి రెడ్డి, ముదిగుబ్బ సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వన్నూరస్వామి, ఆర్ అనంతపురం సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్‌నాయక్, పుట్టపర్తి సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ రెడ్డిలను నియమించారు. అక్టోబరు 30 వరకు ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగనుంది.

అమరావతికి అనంత తమ్ముళ్లు


ప్రత్యేక బస్సులో అమరావతికి బయలుదేరిన అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు అనంతపురం అర్బన్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు గురువారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఆయా బస్సులను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జై అమరావతి అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఘనంగా మే డే వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)
మేడే వేడుకలను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహిం చారు. టీడీపీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ వాటి అనుబంధ సంఘాలు, కాంట్రాక్టు ఔట్‌సో ర్సింగ్, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మేడే సంద ర్భంగా జెండాలను ఎగురవేశారు. కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.


విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న జిల్లా నాయకులు


శ్రీశ్రీ నగర్‌లో మేడే వేడుకలు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


రజకనగర్‌లో మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌బాబు


బళ్లారిరోడ్డులోని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో మేడే వేడుకలు


రాప్తాడులో జెండా ఎగరవేస్తున్న సీపీఐ నాయకులు


శింగనమలలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు


గార్లదిన్నెలో మేడే జరుపుకుంటున్న సీపీఎం నాయకులు


సీకేపల్లిలో మేడేలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు


నార్పలలో మే డే వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు


కనగానపల్లిలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు



సోమలదొడ్డిలో జెండా విష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అమరావతికి తరలిన టీడీపీ నాయకులు


రాజధాని అమరావతి పునఃప్రారంభం ప్రారంభం కార్యక్రమానికి ప్రధాని మోదీ కార్యక్రమానికి గురువారం శింగనమల నుంచి బస్సుల్లో తరలివెళుతున్న టీడీపీనాయకులు. - శింగనమల

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాంపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి పింఛన్లు అందిస్తూ లబ్ధిదారుల యోగక్షేమాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. గ్రామ వీధుల్లో చెత్త దిబ్బలు ఉండటం చూసి వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చుకుందామన్నారు. గ్రామం శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలమని ఎమ్మెల్యే స్థానికులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ. 3వేల నుంచి రూ. 4వేలకు పింఛన్‌ను పెంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రజలంతా భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవి, టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్, పసుపుల శ్రీరామిరెడ్డి, జీసీ బాబు, ప్రతాప్‌చౌదరి, రాఘవనాయుడు, గూగూడు మైనార్టీ నాయకులు షేక్ జాఫర్‌వలి, ఓబులేసు, మిద్దిరాజశేఖర్, సీఐ కౌలుట్లయ్య, ఎంపీడీఓ భాస్కర్, ఎస్ఐ సాగర్, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, ఈఓఆర్డీ శైలజా రాణి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: సామాజిక పింఛన్ల వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత టీడీపీ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి అన్నారు. ఆయన గురువారం మండలంలోని గుమ్మేపల్లి పంచాయతీలో పింఛన్ల పంపిణీ కార్యాక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో గుమ్మేపల్లి సర్పంచ్ దేగల లలితమ్మ అధికారులు నాగరాజు, నవీన్ రామాంజి పాల్గొన్నారు.


గుమ్మేపల్లిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న దేగల కృష్ణమూర్తి

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి : ఎమ్మెల్యే


ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టం వెంకటేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పనిచేయాలని, రైతులతో సత్సంబంధాలు కొనసాగించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఏడీసీసీ బ్యాంకు చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటష్‌కు సూచించారు. వారు గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండారు రవికుమార్, బండారు లీలావతి, పసువుల శ్రీరామిరెడ్డి, జీసీబాబు తదితరులు పాల్గొన్నారు.


ముంటిమడుగు కేశవరెడ్డిని సన్మానిస్తున్న ఆవుల క్రిష్ణయ్య

గార్లదిన్నె, మే 1(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ ఛైర్మన్లుగా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టం వెంకటేష్‌ను గురువారం అనంతపురంలోని వారి స్వగృహాలలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటేష్, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మేయర్‌కు జిల్లా నాయకుల సన్మానం


గుంటూరు మేయర్‌ను సన్మానిస్తున్న దేవళ్ల మురళి, కుంచెపు వెంకటేష్

అనంతపురం అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నానిని టీడీపీ ఉమ్మడి అనంత జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. గుంటూరులోని ఆయన నివాసంలో గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు సుధాకర్, ఉజ్జినప్ప తదితరులు రవీంద్ర నానికి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మిలటరీ స్కూల్‌కు రఘు స్కూల్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు

అనంతపురం విద్య, మే 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు రఘు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్ తెలిపారు. గురువారం వి ద్యార్థిని అభినందించారు. గత ఏడాది 6వ తేదీ జరిగిన రాష్ట్రీ య మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి లింగాల యువ రాజ్ జాతీయ స్థాయిలో ఉన్న ఐదు సీట్లలో ఒకటి సాధించారని స్పష్టం చేశారు. ఇతర విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా యువరాజ్ ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థిని ప్రోత్సహిం చిన స్కూల్ టీచర్లకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలన్నారు.

వైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న పాలమడ రమేష్‌బాబు

అనంతపురం కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడిగా పాలమడ రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. గతనెల 20న అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో పాలమడ రమేష్‌బాబు ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన గురువారం వైశ్య హాస్టల్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, మేడా రామనాథ్, పరుచూరు సూర్యప్రకాష్, శ్రీరామ్ సుధాకర్, మురళి, టంగుటూరి నాగభూషణం, కృష్ణం రఘు, శివరామాంజనేయులు, శబరి వరప్రసాద్, అరవింద్, వైశ్య హాస్టల్ ట్రస్టు కార్యదర్శి మనోజ్, కోశాధికారి సుకుమార్ నూతన అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సహజీవనం చేస్తున్న వ్యక్తిపై మహిళ దాడి

అనంతపురం క్రైం, మే1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోవూరునగర్‌లో ఓ వ్యక్తిపై అతడితో సహజీవనం చేస్తున్న మహిళే దాడికి పాల్పడింది. కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని విద్యారణ్యనగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ రెండో కొడుకు షాజహాన్‌కు 20ఏళ్ల క్రితం తాడిపత్రికి చెందిన సఫోరాతో పెళ్లయింది. వారికి కుమారుడు, కుమార్తె. ఆరేళ్ల క్రితం భార్యతో విడిపోయాడు. మూడేళ్ల నుంచి హిందూపురం సమీపంలోని ముద్దిరెడ్డిపల్లి పాతూరుకు చెందిన తోట ఈశ్వరమ్మతో పరిచయం ఏర్పడింది. కోవూరునగర్‌లోని ఓ అద్దె ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. వారికి 14నెలల హమీల్ బాబా సంతానం. కొంతకాలంగా వారు గొడవపడేవారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో మద్యం తాగి ఈశ్వరమ్మ ను తిట్టాడు. దీంతో ఈశ్వరమ్మ రోకలితో అతడి తలపై బాదడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరు గైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి సయ్యద్ ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు...నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్ తెలిపారు. కాగా ఈశ్వరమ్మ దాడి చేసిందా..?లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా..?అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఏఈ సస్పెన్షన్

శింగనమల మే 1(ఆంధ్రజ్యోతి): మండలం విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ శేష్రాద్రి శేఖర్ గురువారం తెలిపారు. మండలంలోని చిన్న మట్లగొంది గ్రామానికి చెందిన రైతు ముక్కర పెద్ద మునెప్ప గతంలో రెండు వ్యవసాయ సర్వీసుల కోసం ఒకసారి రూ. 15వేలు, నగదు, మరోసారి ఫోన్ పే ద్వారా రూ. 5వేలను ఏఈకి ఇచ్చాడు. అయితే డబ్బులు తీసుకున్నా వ్యవసాయ సర్వీసులు ఇవ్వకుండా తిప్పుతున్నారని రైతు ముక్కర పెద్ద మునెప్ప పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టగా అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో శింగనమల ఇన్‌చార్జ్ ఏఈ విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్ఈ తెలిపారు.

ట్రెల్లిస్ స్కూల్‌లో స్పేస్ సైన్స్ ల్యాబ్


స్కూల్‌ను సందర్శించిన నీలేష్ ఎం దేశాయ్

అనంతపురం విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ది ట్రెల్లిస్ స్కూల్‌లో స్పేస్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం ఆకట్టుకుంది. ట్రెల్లిస్ స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్పేస్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. శుక్రవారం ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎస్ఏసీ) అహ్మదాబాద్ డైరెక్టర్ నీలేష్ ఎం దేశాయ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ట్రెల్లిస్ స్కూల్ విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీకాంత్ వడ్లతో కలసి పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ...అంతరిక్ష పరిశోధన, అంతరిక్ష విద్య అభ్యాసం ప్రస్తుతకాలంతో ఎంతో అవసరం అన్నారు. శ్రీకాంత్ వడ్ల మాట్లాడుతూ....నీలేష్ ఎం దేశాయ్ ఇస్రో చంద్రయాన్-3 ఉపగ్రహప్రయోగంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఈ స్కూల్‌ను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రమజీవుల పక్షాన నిలిచేదే అసలైన కవిత్వం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


కవిసమ్మేళనంలో మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రామికులు, అణగారిన వర్గాల పక్షాన నిలిచేదే అసలు సిసలైన కవిత్వం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. మేడేను పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో 'ఎర్ర పద్యాలతో ఓ సాయంత్రం' పేరుతో నిర్వహించిన కవిసమ్మేళనానికి రాంభూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్ని రంగాలలో కాషాయీకరణ బలవంతంగా రుద్దుతున్నారని, అడ్డుకోకపోతే దేశం శతాబ్దాలు వెనక్కు పోతుందన్నారు. జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ మాట్లాడుతూ కవులు పిరికితనాన్ని విడనాడాలని, గొంతు ఎత్తాల్సిన చోట ధైర్యంగా కలం ఝుళిపించాలన్నారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ సుధాకర్ బాబు మాట్లాడుతూ పేదల కడుపు నింపని మత రాజకీయాలు వ్యర్థమని పేర్కొన్నారు. సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ దేశంలో హిందూ, ముస్లింల మధ్య గొడవలు పెంచి ఫాసిస్టు శక్తులు ఓట్లు దండుకునే వ్యూహాలు పన్నుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మానవత తరిమెల అమర్నాథరెడ్డి, కవులు జూగూరు షరీఫ్, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, చేగువేరా హరి, లీలా మనోహర్, రమేష్, గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణ, రామచంద్రనాయక్, యాడికి సూర్యనారాయణ, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉద్యాన ఏడీ సెలవు పొడిగింపు

అనంతపురం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఏడీ నరసింహారావు తన సెలవును ఈ నెలాఖరు వరకు పొడిగించుకున్నారు. గత మార్చి నెలాఖరులో ఆయన అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. ఏప్రిల్ నెలాఖరుతో సెలవు గడువు ముగిసింది. దీంతో మరో నెల రోజులపాటు ఆయన సెలవు పొడిగించుకున్నారు. గత ఏడాది క్రితం ఇక్కడ ఉద్యాన శాఖ డీడీగా పనిచేస్తున్న రఘునాథ్‌రెడ్డిని ఏపీఎంఐపీ పీడీగా నియమించారు. ఈ క్రమంలో కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఆండాలును జిల్లాకు బదిలీ చేశారు. అయితే ఆమె ఒక రోజులోనే డిప్యుటేషన్‌పై తిరిగి కమిషనరేట్‌కు వెళ్లారు. దీంతో ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీగా నరసింహారావు పనిచేస్తూ వస్తున్నారు. పని ఒత్తిడి కారణంతో ఆయన అనారోగ్యానికి గురైన నేపథ్యంలోనే సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీగా ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ విధులు నిర్వస్తున్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణలో కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల అడ్డంకులు తొలగాలని కోరుతూ సాయినాథుడికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం తపోవనంలోని శివశక్తి సాయి దేవాలయంలో సాయినాథుడి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం


వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు సహకారంతో ఓం సంగీత నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో సోమనాథ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో గురువారం వేసవి శిక్షణా తరగతులు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శిక్షణా శిబిరాన్ని పురందరదాస కీర్తనలను ఆలపించిన గాయకురాలు పరిమళ వ్యాసారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం, నృత్యం, కోలాటం తదితరాల్లో శిక్షణ ఇవ్వడం చాలా అభినందనీ యమని ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్యను అభినందించారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీధర్‌రావు, రిటైర్డ్ వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, పత్తికొండ విజయమ్మ, పంచాంగం సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వీరయ్య చౌదరి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం దారుణ హత్యకు గురైన ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. సంతనూతల పాడు నియోజకవర్గం అమ్మనబ్రోలు గ్రామంలోని వీరయ్య చౌదరి ఇంటికి గురువారం ఆమె స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి వెళ్లారు. వీరయ్య చౌదరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. దారుణ హత్యకు పాల్పడిన వారిని రాష్ట్ర ప్రభుత్వం వదిలిపెట్టదని, తగిన శిక్ష పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి...

చెన్నేకొత్తపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ నాయకుడు మహేశ్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం పరామర్శించారు. మండలంలోని కనుముక్కల గ్రామానికి చెందిన మహేశ్ వారం రోజుల క్రితం ద్విచక్రవాహనంలో వెళ్తూ విజయవాడ సమీపంలోని మంగళగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత చినకాకానిలోని మహేశ్ నివాసానికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించి వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, పాములాయి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న 29మంది అరెస్ట్

● రూ.8.98 లక్షలు స్వాధీనం

నార్పల, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో గురువారం పేకాట స్థావరంపై ఎస్ఐ సాగర్, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న29మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.8.98 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ అరెస్టయిన వారిలో కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి కుళ్లాయిస్వామి దర్శనం కోసం వచ్చిన వారు ఉన్నారన్నారు. గూగూడు గ్రామ సమీపంలో పొలాలలో పేకాట ఆడుతున్నారని, ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి దాడులు నిర్వహించామన్నారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



గుత్తి రైల్వే షెడ్‌లో కార్మిక జెండాను ఎగుర వేస్తున్న రైల్వే కార్మికులు

ఘనంగా మేడే వేడుకలు

● వాడవాడలా ఎగిరిన కార్మిక జెండా

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మేడే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం వేడుకలను నిర్వహించారు.. ఇందులో అన్ని కార్మిక సంఘాల నాయకు లు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, కార్మికులు, హమాలీలు ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొని కార్మిక జెం డాను ఆవిష్కరించారు. అలాకే కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. వక్త లు మాట్లాడుతూ.. మేడే ఆవశ్యకతను వివరించారు. కార్మికులంద రూ ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలునిచ్చారు. ప్రభుత్వాలు కార్మికులను గుర్తించి పనికి తగ్గ వేతన ఇవ్వాలని, వారికి తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల కార్మికులు ర్యాలీలు చేపట్టారు.


గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు


తాడిపత్రిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


రాయదుర్గం ఆర్టీసీ డిపో వద్ద జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు


శెట్టూరులో కార్మిక దినోత్సవంలో అంగన్‌వాడీ వర్కర్లు


గుమ్మఘట్ట మండలం బేలోడులో ఉపాధిహామీ కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


కల్యాణదుర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కార్మికులకు హక్కులు, చట్టాలపై అవగాహనుండాలి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి

గుత్తి, మే1(ఆంధ్రజ్యోతి): కార్మికులు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ కోర్టు న్యా యాధికారి కాశీవిశ్వనాథాచారి సూచించారు. కా ర్మికుల దినోత్సవాన్ని పు రస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం కార్మికుల సమావేశం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని చట్టాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ శ్రీపాద, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సూర్యనారాయణ, న్యాయవాదులు , కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశం లో మాట్లాడుతున్న న్యాయాధికారి

హక్కులను కాపాడుకోవాలి..

గుంతకల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీరప్ప సర్కిల్లో గురువారం ఉదయం జగదీశ్ నేతృత్వంలో హమాలీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు మేడే వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా తొలుత కార్మిక జెండను ఎగురవేశారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. పోరాట పంథాలో హక్కులను పరిరక్షించుకోవడానికి అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హమాలీ కార్యాలయంలో నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు పత్తి హిమబిందు, సీపీఐ నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, బీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికజెండాను ఆవిష్కరిస్తున్న డీ జగదీశ్

యాడికి అభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, మే 1(ఆంధ్రజ్యోతి): యాడికి మండల కేంద్రం అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని తమ నివాసంలో గురువారం వారు యాడికి మండలకేంద్రానికి సంబంధించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాడికి మండలకేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా ఆటంకం కలిగిస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. అభివృద్ధి కోసం ఎంత దూరమైనా వెళతామన్నారు. అక్కడి లక్ష్మీ చెన్న కేశవస్వామి భూములను ఇప్పటికే కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, వాటినన్నింటినీ టెంపుల్‌యాక్ట్ ప్రకారం వెలికితీయిస్తామని తెలిపారు. ఆలయాలు భూములు, పంచాయతీ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి అయి ఉంటే వాటిని రికవరీ చేస్తామన్నారు. వాటినన్నింటిని తిరిగి స్వచ్ఛందంగా అప్పగించినట్లయితే యాడికి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అందరూ సహకరించినట్లయితే మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకుడు రుద్రమనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

మామిడిచెట్ల నరికివేత కేసులో నిందితుల అరెస్టు

పెద్దవడుగూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మామిచెట్లు నరికివేత కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిత్రచేడు గ్రామంలో సన్ననారాయణకు, ఆయన బంధువులకు చెందిన 105మామిడిచెట్లు గత నెల 17వ తేదీన నరికివేతకు గురయ్యాయి. దీంతో బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు గురువారం ఉదయం 11గంటలకు చిత్రచేడు గ్రామ పరిసరాల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒకరైన కమ్మన్నగారి రమేష్ అలియాస్ భగవంత చిత్రచేడు గ్రామానికి చెందినవాడే. అతను అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయం తెలిసి సన్ననారాయణ, కొంతమంది బంధువులు అతన్ని మందలించారు. దీన్ని మనసులో పెట్టుకున్న కమ్మన్నగారి రమేష్ వారిని ఎలాగైనా నష్టపరచాలనే కక్షతో తనకు పరిచయం ఉన్న వీరన్నపల్లికి చెందిన చింతాకు శంకరతో కలిసి ఆరునెలలుగా పలు కుట్రలు చేశాడు. అందులో భాగంగా ఒకరిని చంపాలని, దాడులు చేయాలని పన్నాగం పన్నారు. అయితే అవేవీ సఫలం కాలేదు. ఆ తర్వాత గడ్డివామును తగలబెట్టడం, స్టార్టర్ పెట్టె దొంగలించడం వంటివి చేశారు. అయితే బాధితులు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదు. దీంతో ఇంక ఎవరూ ఏమీ చేయలేరనే ఉద్దేశంతో వారు అక్రమ సంబంధం కలిగి ఉన్న మహిళతో కలిసి గత నెల 17న తోటలోకి వెళ్లి కొడవలితో మామిడి చెట్లను నరికివేశారు. వారి నుంచి మామిడి చెట్లు నరకడానికి ఉపయోగించిన కొడవలి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.


నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్ఐ

సీఎస్‌డీటీపై ఆర్డీఓకు ఫిర్యాదు

గుంతకల్లు, మే1(ఆంధ్రజ్యోతి): మండల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సుబ్బలక్ష్మి కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసినందున శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ నెలగొండ గ్రామానికి చెందిన ఎం వీరాంజనేయులు అనే వ్యక్తి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. నెలగొండ గ్రామంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్లు రేషన్ సప్లయి చేయడం లేదంటూ వీరాంజనేయులు గతంలో సీఎస్‌డీటీకి ఫిర్యాదు చేశారు. ఆమె పట్టించుకోకపోవడంతో అతను గత నెలలో రాష్ట్ర సచివాలయంలోనూ, పౌర సరఫరాల శాఖామంత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకుని సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మిని మే 1న స్థానిక ఆర్డీవో కార్యాలయంలో హాజరు కావాలంటూ ఆదేశించారు. అయితే ఆర్డీఓ కార్యాలయానికి సీఎస్‌డీటీ రాలేదని, మంత్రి, కలెక్టర్ ఆదేశాలను నిర్లక్ష్యం చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ వీరాంజనేయులు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు.

సౌత్ క్యాబిన్ తనిఖీ

గుంతకల్లు, మే1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిధిలో గల సౌత్ సిగ్నలింగ్ క్యాబిన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా గురువారం తనిఖీచేశారు. రైళ్ల నిర్వహణ, భద్రత విషయంగా కేబిన్ సిబ్బందికి సూచనలిచ్చారు. అక్కడున్న సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్ వ్యవస్థను పరిశీలించారు. కార్యక్రమంలో మెకానికల్, సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్ శాఖాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామిడి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాంపల్లి గ్రామం వద్ద గల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగుళూరుకు చెందిన శశికుమార్, సువర్ణ, జయమ్మ మంత్రాలయం నుంచి బెంగుళూరుకు కారులో బయలుదేరారు. గజరాం పల్లి వద్ద కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో అందులోని ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను 108వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కణేకల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నేసేపేటకు చెందిన సులోచన (20) అనే యువతి ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తండ్రి తిప్పేస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సులోచన బుధవారం నుంచి కనపడకపోవడంతో తమ బంధువుల ఇళ్లలో, స్నేహితుల వద్ద గాలించామమని, ఎక్కడా ఆచూకీ తెలియరాలేదని, దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ నాగమధు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రాల ప్రారంభం

తాడిపత్రి, మే1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, అశోక్‌పిల్లర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని మైత్రి మల్లికార్జునరెడ్డి రెండుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఆత్మీయ అభినందన సభకు తరలిరండి

తాడిపత్రి, మే1(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని మాసినేని గ్రౌండ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 4వ తేదీన దళిత ఉద్యోగుల సమైఖ్య ఆధ్వర్యంలో దళిత ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ జరగనుందని, ఇందుకు భారీగా తరలిరావాలని ఎంఈఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగయ్య గురువారం ప్రకటనలో కోరారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణ అమలుకోసం ఆర్డినెన్స్ జారీచేసినందుకు సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

విడపనకల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొనేకల్లు, విడపనకల్లు సరిహద్దు చెక్ పోస్టులను అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం ఉరవకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారాను పూర్తిగా నిర్మూలించాలని సిబ్బందికి సూచించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసి కర్ణాటక మద్యం అక్రమ రవాణా కాకుండా చూడాలన్నారు. ఇందుకు వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు జయనాథ్‌రెడ్డి, రవిచంద్ర, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపప్పూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో గల పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.32,160 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

నేడు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ

యాడికి, మే1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీని శుక్రవారం యాడికిలో నిర్వహించనున్నట్లు యాడికి, పెద్దవడుగూరు మండలాల వ్యవసాయశాఖ అధికారులు మహబూబ్‌బాషా, మల్లేశ్వరి గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందులో యాడిక మండలంలోని 35మందికి, పెద్దవడుగూరు మండలంలోని 62మంది లబ్ధిదారులకు పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో ముగ్గురికి రిమాండ్

తాడిపత్రి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పవన్‌కుమార్, మహేష్, పుల్లయ్యను గురువారం ఎస్సీ, ఎస్టీ కేసు కింద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 15వ తేదీన స్థానిక గాంధీనగర్‌కు చెందిన మారెమ్మ ఆలయ పూజారి కుళ్లాయమ్మపై, ఆమె కుమారులపై పవన్, మహేష్, పుల్లయ్య దుర్భాషలాడుతూ దాడిచేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంలో అప్పట్లో పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ మేరకు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: ఆర్డీఓ

గుంతకల్లు టౌన్, మే1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్డీటీ సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను గురువారం సాయంత్రం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారులు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని, అవి కూడా ఉన్నత భవిష్యత్తుకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్డీటీ కోచ్ ఇనయతుల్లా, పాఠశాల పీడీలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

ఉరవకొండ, మే1(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు తహసీల్దార్‌గా నరేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నయాజ్ అహ్మద్ రిటైర్డ్ అవడంతో అక్కడే డీటీగా విధులు నిర్వర్తిస్తున్న నరేష్‌కు (ఎఫ్ఏసీ) ఇచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సిబ్బంది అభినందించారు.

అలరించిన పౌరాణిక నాటకం

పామిడి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలో బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ తెలుగుభాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.దేవరాజు మాట్లాడుతూ... పౌరాణిక రంగస్థల నాటకాలు రోజురోజుకూ అంతరించిపోతున్న ఈ తరుణంలో పేద కళాకారుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం నాటక ప్రదర్శనలు కల్పించడం హర్షణీయమన్నారు. కళాకారులు నరహరి, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, సుధాకర్, చితంబరరెడ్డి, అరుణకుమారి, నాగవేణి, మస్తాన్ నాటక ప్రదర్శన గావించారు.

భర్త మరణించిన నాలుగు నెలలకే పింఛన్

ఉరవకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామంలో సిద్ధారెడ్డి అనే వ్యక్తి చనిపోగా, ఆయన భార్య మారెక్కకు పింఛన్ మంజూరైంది. ఈ క్రమంలో రూ.4వేల పింఛన్ సొమ్మును టీడీపీ నాయకులు సిసింద్రీ, నెట్టెం రాము గురువారం ఆమెకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భర్త చనిపోయిన తర్వాత 4నెలల వ్యవధిలోనే భార్యకు ప్రభుత్వం ఫించన్ అందివ్వడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు

ఆంధ్రజ్యోతికి స్పందన

గుత్తి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధికి వెళ్లే రహదారిపై డ్రైనేజీ మ్యాన్ హోల్‌కు మూత లేకపోవడంతో ఆటో చక్రం ఇరుక్కుపోయి ఇబ్బందులు తలెత్తడంపై గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు ఆ మ్యాన్ హోల్‌పై మూత ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


మూత ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజధానికి తెలుగు తమ్ముళ్లు

● మోదీ సభలో పాల్గొనేందుకు పెద్దఎత్తున తరలిన వైనం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్ర రాజధాని అమరావతిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రధాని మోదీ సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి వివిధ వాహనాల్లో గురువారం సాయంత్రం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రూ. 57,962 కోట్ల వ్యయంతో రాజధాని పునర్నిర్మాణ పనులను మోదీ ప్రారంభించనున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వం లో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు.


పామిడి నుంచి అమరావతికి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు


కుందుర్పిలో..

కసాపురంలో ధన్వంతరి హోమం

గుంతకల్లు టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ధన్వంతరి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం యాగశాలలో ఉత్సవమూర్తిని కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ ధన్వంతరి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

గుత్తి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 17, 18వ వార్డుల్లో గురువారం చే పట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో టీడీ పీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన వృద్ధులకు పింఛన్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ను సీఎం చంద్రబాబు త్వరలో అమలు చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు నరేంద్రచౌదరి, వార్డు ఇన్చార్జి ఎస్ఎం బాషా, తెలుగుయువతమండల నాయకుడు సుధాకర్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.


పింఛన్ అందజేస్తున్న వెంకటశివుడుయాదవ్

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

గుంతకల్లు టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అదే కళాశాలలో డీవైఎఫ్ఐ నాయకులు అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు హాజరై మాట్లాడారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డీవైఎఫ్ఐ నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ వరప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానించిన డీవైఎఫ్ఐ నాయకులు

ఘనంగా బసవేశ్వర జయంతి


బసవేశ్వరుడి చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న వీరశైవసంఘం నాయకులు

ఉరవకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం వీరశైవ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా గవిమఠం పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి హాజరై బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అందరూ ఆ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా ఖో- ఖో సంఘం చెర్మన్ భీమిరెడ్డి, వీరశైవసంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

విడపనకల్లు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్ర, ఈఈ మల్లికార్జున మూర్తి, పీఆర్ డీఈ మహ్మద్ రసూల్, ఎస్ఈ మహమ్మద్ జహీర్ అస్లామ్ పరిశీలించారు. ఉపాధి పనుల్లో భాగంగా డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డును తారు వేయకున్నా వేసినట్లు ఎమ్ బుక్కులో రికార్డు చేసి దాదాపుగా రూ. 26 లక్షలు కాజేసిన విషయంపై అధికారులు మూడు రోజులుగా విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం వారు ఆర్ కొట్టాల రోడ్డుకు చేరుకుని 6ఎంఎం కంకర ఎంత మేరకు వేశారనేదానిపై రోడ్డును వందమీటర్లుకు ఒక చోట తవ్వి పరిశీలించారు. అప్పటి పీఓ (ఎంపీడీఓ) ఏవీ శ్రీనివాసులు ఉపాధి పనులు చేయక పోయినా చేసినట్లు రికార్డులు చేయించారని ఆర్ కొట్టాల, డొనేకల్లు గ్రామస్థులు అధికారులకు తెలిపారు. ఈ విషయమై ఎస్ఈ మట్లాడుతూ రోడ్డు పనులు ఎంత వరకూ చేశారు అనేది పూర్తి స్థాయిలో జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌లో పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ లక్ష్మీనారాయణ, రిటైర్డు ఏఈ మధు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

సర్వే పరిశీలన

రాయదుర్గం, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ. 50 కోట్ల మంజూరు కాగా.. ఆ పనులకు సంబంధించి ఎస్‌జీఎస్ కన్సల్టెన్సీ చేపట్టిన సర్వేను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పైతోట వద్ద పరిశీలన చేసి వారం లోపు సర్వే మొత్తం పూర్తి చేసి డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సంబంధిత కన్సల్టెన్సీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈ నరసింహులు పాల్గొన్నారు.

ఏడీసీసీబీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

యల్లనూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డిని టీడీపీ మండల నాయకులు గురువారం జిల్లాకేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండల కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు లభిస్తుందనేదానికి కేశవరెడ్డి నియామకమే నిదర్శనమని అన్నారు. కలిసిన వారిలో జంగంపల్లి అనిల్‌కుమార్‌చౌదరి, అన్నమయ్య, పవన్, హరీష్, బాషా తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు

కళ్యాణదుర్గం, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ హెచ్చరించారు. స్థానిక పలు దుకాణాలు, హోటళ్లల్లో గురువారం ఆయన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. బళ్లారి మిట్ట సర్కిల్, ఆర్టీటీ ఆస్పత్రి ప్రాంగణంతో పాటు పలు సర్కిళ్లల్లో ఉన్న హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం వాటి యజమానులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను ఏ మాత్రం వాడరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించడమే కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడడం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించి, పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.


ఓ హోటల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్